బీజేపీ సంబురాలు

మోతీనగర్: భారతీయ జనతా పార్టీ హర్యానా ఎన్నికల్లో అత్యధిక శాసన సభ్యులను గెలవడంతో అల్లాపూర్ డివిజన్‌లో మంగళవారం బాణాసంచా పేల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో సుదర్శన్, వెంకటరమణారెడ్డి, కుమార్ గుప్తా, నాగరాజుగౌడ్, గంగాధర్, యాదగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ ఒప్పందం



టీహబ్‌లో సీఈఓ శ్రీనివాసరావుతో సమావేశమైన ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్ హెడ్ సోని మహంతి

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో టీహబ్ మంగళవారం ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా భారత్‌లో వెబ్ 3 స్టార్టప్‌ల కోసం బ్లాక్ చెయిన్ ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయనున్నారు. అంతకుముందు టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావుతో ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్, ఎకో సిస్టమ్ బిల్డింగ్ హెడ్ సోని మహంతి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఎక్స్‌డీసీ నెట్‌వర్క్‌తో మా భాగస్వామ్యం భారతీయ స్టార్టప్‌లకు కొత్త ఆవిష్కరణలు, గణనీయమైన మార్పును తీసుకురావడానికి అవసరమైన సాధనాలు, మద్దతును అందిస్తుందని చెప్పారు. సోని మహంతి మాట్లాడుతూ భారత్‌లో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వినియోగ విస్తరణకు టీహబ్‌తో మా భాగస్వామ్యం ఒక ప్రధాన మైలురాయి అని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌కు చెందిన సయ్యద్ అజహర్ అలీ అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.2.50 లక్షల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం అలీ కుటుంబ సభ్యులకు అందించారు. నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ నవరాత్రులు



రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారు



సుమిత్రనగర్‌లో అన్నపూర్ణా దేవి అవతారంలో..



కేపీహెచ్‌బీ కాలనీలోని కనకదుర్గాదేవి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో..



రిటైల్ మార్కెట్‌లో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

నియోజకవర్గంలోని వివిధ మండపాలు, ఆలయాల వద్ద అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, హోమం, తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద ప్రజా ప్రతినిధులు పూజలు నిర్వహించారు.
–కూకట్‌పల్లి జోన్‌బృందం



ఆంజనేయనగర్‌లోని అమ్మవారి పూజలో కార్పొరేటర్ పగడాల శిరీష



కట్టమైసమ్మ ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు



సేవాలాల్ నగర్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



రామాలయం వద్ద పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి



బృందావన్ కాలనీ అమ్మవారి పూజలో..



హస్మత్‌పేటలో అమ్మవారిని దర్శించుకున్న సునీతా మహేందర్‌రెడ్డి, యాదగిరి



అమ్మవారికి పూజలు చేస్తున్న మక్కాల సత్యనారాయణ



కైత్లాపూర్‌లో అమ్మవారి వద్ద బండి రమేష్, వెంకటేశ్వరరావు



ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్ వద్ద అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



చేనేత హస్తకళా వస్తువుల ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆల్విన్‌కాలనీ: చేనేత కళాకారులని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో నిజాంపేట్ రోడ్డులోని కొలను నారాయణ రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం చేనేత హస్తకళా, వస్తువుల ప్రదర్శన ప్రారంభమైంది. కళాసిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, బెడ్‌షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని శారీస్, రాజస్థాని కోటా శారీలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికెన్‌వర్క్ కుర్తీస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, యువతకు మెచ్చే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 27 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందన్నారు.



తప్పిపోయిన బధిర బాలుడి ఆచూకీ లభ్యం

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్రో స్టేషన్ దగ్గర ఆడుకుంటూ తప్పిపోయిన బధిర బాలుడి ఆచూకీని మియాపూర్ పోలీసులు కనుగొన్నారు. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన మహేష్ కుమారుడు లక్కి(9) ఈ నెల 2వ తేదీ మెట్రో స్టేషన్ దగ్గర ఆడుకుంటూ తప్పిపోయాడు. తండ్రి మహేష్ 5వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ అధికారి ప్రవీణ్, మియాపూర్ ఎస్‌ఐ మాణిక్యం బృందం బాలుడి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నగరంలోని బధిరుల హాస్టళ్లలో ఆరా తీశారు. ఈ క్రమంలో మంగళవారం కూకట్‌పల్లి చైల్డ్ వెల్ఫేర్ ఆశ్రమంలో ఉన్నట్లు గుర్తించారు. బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం మైథిలి కిదాంబి శిష్య బృందం వీణ కచేరి ఆకట్టుకుంది. కళాకారులు శారద, సాహితి, మహతి, మనస్విని, మనోజ్ఞ, అలేఖ్య, మిహిర్ పాల్గొన్నారు. అలాగే బెంగుళూరికి చెందిన భరతనాట్య కళాకారులు హేమబృందం తమ ప్రదర్శనతో అలరించారు. కళాకారులు హర్షిత, ముక్తలు ప్రదర్శించిన అంశాలు గణేశకృతి, నంది చోళం, చాముండేశ్వరీ, దేవీస్తుతి, దేవీ కృతి, నటనం, ఆదినార్, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. సుశ్మిత మిశ్ర శిష్యబృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఉత్సవాలకు అన్ని విధాలా ఏర్పాట్లు



ఏర్పాట్ల గురించి మహిళలతో చర్చిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: దసరా, బతుకమ్మ ఉత్సవాలకు అన్ని విధాలా ఏర్పాట్లను పూర్తి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం శివమ్మ కాలనీ రామాలయం దగ్గర, అంబీర్ చెరువు కట్ట మీద బతుకమ్మ సంబరాలు, శనివారం సాయంత్రం 6 గంటలకు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో శివరాజ్ గౌడ్, గణేష్, మహేష్, సంతోష్, కిట్టు, రాజ్యలక్ష్మి, అరుణ, మంజుల, సౌందర్య, పుట్టం దేవి, స్వరూప, వల్లి రమణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

14న ప్రపంచ పెద్దల దినోత్సవం

ఆల్విన్‌కాలనీ: సీనియర్ సిటిజన్స్ సంఘాల సమాఖ్య, కూకట్‌పల్లి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పెద్దల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. వివేకానందనగర్ కాలనీలోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో 14న సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథి, ప్రధాన వక్తగా ఐఏఎస్ అధికారి వాడ్రేపే చిన వీరభద్రుడు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేవలందించిన ఐదుగురు సీనియర్ సిటిజన్లను సన్మానించనున్నట్లు తెలిపారు. ఇద్దరు దివ్యాంగులు, ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు.

పంచలోహ అమ్మవారి విగ్రహం విరాళం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్తలు వాడ్యాల భాస్కర్ రెడ్డి, శ్యామల దంపతుల కుమార్తె సుష్మ రంజిత్ రెడ్డి దంపతులు మంగళవారం రూ.2 లక్షల వ్యయంతో 100 కేజీల పంచలోహ విగ్రహాన్ని ఆలయ ధర్మకర్తకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు అభినందించారు.

డీజే నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మూసాపేట: డీజే నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఆయా ప్రాంతాల వారీగా నిర్దేశించిన డెసిబెల్స్‌లో మాత్రమే ప్లే చేయాలేని ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ పరిధిలోని 4 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సుమారు 30 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజే ప్లే చేసేందుకు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ ముత్తు, డీఐ వెంకటేశ్వర్లు, అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి, కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న, బాచుపల్లి డీఐ తిమ్మప్ప, డీజే నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

బతుకమ్మ పాట.. ఆడపడుచుల ఆట





కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం కూకట్‌పల్లిలోని వెంకట్‌రావు నగర్ చౌరస్తాలో మహిళలు అందరూ కలిసి బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. అదే విధంగా హెచ్ఏఎల్‌లో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళలు వివిధ రకాల బతుకమ్మలను తయారు చేసి సౌత్ గేట్‌వద్ద బతుకమ్మ ఆడారు. బతుకమ్మలను చక్కగా పేర్చిన మహిళలకు హెచ్ఏఎల్ ఆఫీసియేటింగ్ జనరల్ మేనేజర్ మురళీ కృష్ణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ డిజైన్ నాగేష్, వెల్ఫేర్ ఫండ్ చైర్మన్ శ్రీహరిరావు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబు, గౌరవాధ్యక్షులు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, చంద్రరావు నాయక్, మహేశ్‌గౌడ్, క్రాంతికుమార్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

బాలానగర్: బతుకమ్మ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని కూకట్‌పల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. శోభరాజ్ అన్నారు. కూకట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డా.మల్లేశ్వరి, వైద్యులు మమత, కూకట్‌పల్లి, మూసాపేట సిబ్బంది పాల్గొన్నారు.



కూకట్‌పల్లి వెంకట్‌రావునగర్ చౌరస్తా వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



హెచ్ఏఎల్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ..

నేటి నుంచి చెరువుల్లోకి చేప పిల్లలు

- 232 చెరువుల్లో...34 లక్షల చేప పిల్లలు వదిలేందుకు చర్యలు
- శామీర్‌పేట పెద్ద చెరువులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఆలస్యంగానైనా .. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖ ముహూర్తం ఖరారు చేసింది. సాధారణంగా వర్షాకాలం ఆరంభమై.. చెరువులు, కుంటలు నిండగానే ఆగస్టు లేదా సెప్టెంబర్ నాటికి చేప పిల్లలను పంపిణీ చేస్తారు. చేప పిల్లల టెండర్ల ప్రక్రియ జాప్యం కావటంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమానికి మత్స్యశాఖ శ్రీకారం చుట్టింది. శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా బుధవారం చేప పిల్లలను వదలనున్నారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్ గౌతమ్, మత్స్యశాఖ అధికారి పూర్ణిమా, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. 2024–25 సంవత్సరంలో మత్స్యశాఖ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 232 చెరువుల్లో 34 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది.

80–100 మి.మీ చేప పిల్లల పంపిణీ..



చెరువుల్లో పంపిణీ చేయనున్న 34 లక్షల చేప పిల్లలల్లో 35–40 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు, 80–100 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు ఉన్నట్లు మత్స్య శాఖ పేర్కొంది.ఇందులో నాలుగు రకాలు(తెగలు) చేప పిల్లలు ఉన్నాయి.

83 సంఘాల్లో 3,773 మంది సభ్యులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 83 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 64 ప్రాథమిక పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. అలాగే 13 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, మూడు ఫిషర్మెన్ మార్కెటింగ్ కో–ఆపరేటివ్ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 3,773 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారన్న సంకల్పంతో ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచుతోంది.

గతేడాదిలో 91 లక్షల చేప పిల్లల పంపిణీ

గతంలో జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 352 చెరువుల్లో ఉచితంగా 91 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80–100 ఎం.ఎం.) 13.50 లక్షలు కాగా, చిన్న సైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ పేర్కొంది.

చేప పిల్లల పంపిణీ ప్రారంభం



మత్స్యకారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వేయనున్నాం. చేప పిల్లలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో బుధవారం నుంచి చెరువుల్లో వేయనున్నాం. కలెక్టర్ ఆదేశాలతో గుర్తించిన 232 చెరువుల్లో 34 లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తున్నాం.
– పూర్ణిమా, మత్స్యశాఖ అధికారి